క్లుప్తంగా

నీటి సరఫరాకు నేడు అంతరాయం

అగనంపూడి : జీవీఎంసీ 87వ వార్డు కణితి హైస్కూల్ ఆవరణలోని 200 కేఎల్ ఈఎల్ఎస్ఆర్ ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రధాన వాల్వ్‌లు, కణితి ఎస్సీ కాలనీలో గల ప్రధాన నీటి సరఫరా వాల్వ్‌ల మరమ్మతులు చేపట్టనున్నట్టు జీవీఎంసీ నీటి సరఫరా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేథరీనాథ్ తెలిపారు. ఈ కారణంగా గురువారం వార్డు పరిధిలోని ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. నీటి సరఫరాలో కలుగుతున్న అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

మనస్తాపంతో ఆత్మహత్య

పెదగంట్యాడ : ఒకవైపు ఒంటరితనం.. మరోవైపు అనారోగ్యం.. ఆపై మద్యానికి బానిస కావడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొరపల్లి అర్జున్ రాజు (46) మండలంలోని టీజీఆర్ నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఒంటరిగా నివసిస్తున్నాడు. స్టీల్‌ప్లాంట్‌లో మెయింటెనెన్స్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఒంటరిగా ఉండడంతోపాటు అనారోగ్యంతో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన ఇంట్లోని కిచెన్‌లో హుక్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి గోపాలపట్నంలో ఉంటున్న మృతుని సోదరుడు గొరపల్లి అప్పలస్వామికి సమాచారం అందజేశారు. వెంటనే అతను వచ్చి పోలీసులకు సమాచారమిచ్చాడు. న్యూపోర్టు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని సోదరుడు అప్పలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

గాజువాక : రోటరీ క్లబ్ గాజువాక నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా సిరట్ల శ్రీనివాస్ గౌడ్, ఎం.సూర్యనారాయణ తదితరులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులకు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, సినీ నటుడు ప్రసన్న కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పోషకాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు సీహెచ్.కిశోర్ కుమార్, మురళీకృష్ణ, ఎస్.లక్ష్మణరావు, ఎం.సత్యవాణి, విక్టర్‌రాజు, రాజేశ్వరరావు, బి.హేమంతరావు, ఎం.కృష్ణవేణి, జాన్‌డీన్, రామకృష్ణ, ప్రభూజీ, పి.జి.విజయరాజు, ఇ.భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్ట్

గోపాలపట్నం: ఒడిశా ఏజెన్సీ ప్రాంతం నుంచి వస్తున్న ముగ్గురు వ్యక్తుల నుంచి 1.5కిలోల గంజాయి, 3 కిలోల లిక్విడ్ గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గోపాలపట్నం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పాడేరు రూరల్ ఒడిశా బోర్డర్ నుంచి కేజిన్నర గంజాయి, 3కిలోల లిక్విడ్ గంజాయిని ఎన్ఏడీ కాకానినగర్ కు చెందిన రామ్ ప్రసాద్, విజయనగరానికి చెందిన భరత్ శ్యామ్‌సుందర్, మరో మైనర్ తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో విమాన్‌నగర్ నుంచి యల్లపువాని పాలెం ఎస్సీ కాలనీ రోడ్డులో వలవేసి పట్టుకున్నారు. వారి నుంచి గంజాయి, లిక్విడ్ గంజాయితో పాటు 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు పంపిచారు.

విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు



విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గాజువాక: స్థానిక భాస్కర్ విద్యా నికేతన్‌లో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. వీ డెంటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో చిన్నారులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం దంతాల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దంత వైద్యులు ఎం.హరికిశోర్, మణికుమారి, డి.ఆదిత్య, పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులపై ప్రభుత్వం దాడి

- ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన
- భెల్ వద్ద కార్మిక సంఘాల ఆందోళన



భెల్ ప్రధాన గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

అక్కిరెడ్డిపాలెం : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు భెల్ (హెచ్‌పీవీపీ)లో అన్ని కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు బుధవారం ఆందోళన చేశారు. సంస్థ ప్రధాన గేటు వద్ద సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి. ప్రకాష్ మాట్లాడుతూ ఎన్‌డీఏ పాలనలో కార్మికులపై దాడి జరుగుతోందన్నారు. మూడోసారి కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలు కొనసాగిస్తున్నారన్నారు. కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా పోరాడితేనే హక్కులు సాధించుకోగలమన్నారు. ఆనాడు బీహెచ్‌పీవీని ఎలా కాపాడుకున్నామో గుర్తు చేశారు. గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.సాహూ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికుల మీద దాడి చేస్తోందన్నారు. స్థానిక భెల్ యాజమాన్యం సమస్యలపై త్వరలోనే సమావేశం నిర్వహించి పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోతే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు మూడు సంవత్సరాలుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. భెల్‌లో కూడా ప్రైవేట్ షేర్లు ఉన్నాయని, వాటిని అమ్మి భెల్‌ను కూడా ప్రైవేట్‌పరం చేయాలని చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పి.వి.ఎస్.రాజు, సనపల జగన్నాథరావు, కొల్లి దేముడు, వి.ఆనందరావు, సీతంనాయుడు, డి.నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

14న 'ఉక్కు విలీన' దీక్ష



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి, రక్షించాలన్న డిమాండ్‌పై ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆధ్వర్యంలో ఈ నెల 14న నిర్వహించనున్న ఉక్కు విలీన దీక్షకు సంబంధించి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బుధవారం సాయంత్రం సీ భవన్ వద్ద జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 7 గంటలకు ఉక్కు అమరవీరుల కూడలి నుంచి సీ భవన్ వరకు ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. అనంతరం ఉదయం 8 నుంచి సాయంత్రం 8 గంటల వరకు దీక్ష నిర్వహిస్తామన్నారు. ఉక్కు విలీన దీక్షలో సెఫీ చైర్మన్ ఎన్.కె.బంచోర్, ఎన్‌సీవోఏ ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీ నాయకులు కాటం చంద్రరావు, కె.వి.డి.ప్రసాద్, చంద్ర వెంకటేశ్వరరావు, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

డీఈవో ఆకస్మిక తనిఖీలు



మింది జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల నోట్ బుక్స్‌ను తనిఖీ చేస్తున్న డీఈవో చంద్రకళ

అక్కిరెడ్డిపాలెం: జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆమె పలు తరగతులను పరిశీలించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించిన అనంతరం విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయులను డ్రాప్ అవుట్ విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారిని తిరిగి పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్కూల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. హెచ్ఎంకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు విశ్వనాథం, సునీత, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు నిర్ణయం తగదు



సమావేశంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రతినిధులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులు 4 వేల మందిని తొలగించాలని నిర్ణయించడం తగదని ఉక్కు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ప్రతినిధులు అన్నారు. బుధవారం అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎల్ఎంఎం పార్కులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులను యాజమాన్యం భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. సకాలంలో జీతాలు చెల్లించాలని, స్కిల్డ్ కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగ భద్రత, ప్రైవేటీకరణ అంశంపై ఉక్కు మంత్రికి వినతిపత్రం సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రి రవి, నమ్మి రమణ, పి.భాస్కరరావు, పిట్టా రెడ్డి, శ్రీనివాస్, సోమరాజు, యు.అప్పారావు, డి.రామిరెడ్డి, జి.వెంకట లక్ష్మి, ధనలక్ష్మి, గొందేశి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, కంది పప్పు స్టాల్ ప్రారంభం నేడు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-9లోని రైతుబజార్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో బియ్యం, కంది పప్పు స్టాల్‌ను గురువారం ప్రారంభించనున్నట్టు 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతున్న ఈ షాపులో బియ్యం కిలో రూ.49, కంది పప్పు రూ.160కు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్‌పై ముగిసిన శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న వారితో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: క్యాన్సర్ స్క్రీనింగ్‌పై నెల రోజుల నుంచి జరుగుతున్న శిక్షణ నేటితో ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో చేపట్టనున్న క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం కోసం సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇస్తున్న సంగతి విదితమే. అందులో భాగంగా హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ పర్యవేక్షణలో గత నెల 13వ తేదీ నుంచి శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ఉన్న మెడికల్ కాలేజీ వైద్య నిపుణులు (సామాజిక వైద్య శాస్త్ర అధ్యాపకులు, గైనకాలజిస్ట్, డెంటల్ సర్జన్లు, రేడియాలజిస్ట్, సాధారణ సర్జన్లు, రేడియేషన్ అంకాలజిస్టులు, సర్జికల్ అంకాలజిస్టులు) శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ఉన్న అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో గల గైనకాలజిస్ట్, డెంటల్ సర్జన్లు, జిల్లా టీం వారు శిక్షణ తీసుకున్నారు. జిల్లాలో ఉన్న 91 మంది వైద్యులు, 9 మంది స్టాఫ్ నర్సులు, 54 మంది సీహెచ్‌వో, 498 మంది ఏఎన్ఎంలకు బ్యాచ్‌ల వారీగా రోజుకు 40 మంది చొప్పున ఆంధ్ర వైద్య కళాశాలలో శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ఆధ్వర్యంలో జిల్లా ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ నోడల్ అధికారి డాక్టర్ కె. సాయిసుప్మ, సామాజిక వైద్య విభాగాధిపతి డాక్టర్ ఎ. కృష్ణవేణి, ప్రముఖ అంకాలజిస్టు డాక్టర్ శిల్ప తదితరుల ఆధ్వర్యంలో ఈశిక్షణ కార్యక్రమం జరిగింది.

ఎన్ఎంఎంఎస్ ఉచిత శిక్షణకు ఆహ్వానం

తగరపువలస : చిట్టివలస ఫ్రెండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) ఉచిత శిక్షణకు సంప్రదించాలని ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంటాన మోహనరావు, రేఖ అప్పారావు కోరారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి అర్హులన్నారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏడాదికి రూ.12 వేలు వంతున స్కాలర్‌షిప్ వస్తుందన్నారు. మూడేళ్లుగా ఇస్తున్న ఉచిత శిక్షణకు చుట్టుపక్కల గ్రామాల హైస్కూళ్ల నుంచి విద్యార్థులు హాజరై ఇప్పటి వరకు 41 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు చిట్టివలస హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు, ఉపాధ్యాయుడు పి.నాగేశ్వరరావును సంప్రదించాలని కోరారు.

ఘనంగా బీవీపీ వ్యవస్థాపక దినోత్సవం



జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభిస్తున్న ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, తదితరులు

సీతంపేట: భారత్ వికాస్ పరిషత్(బీవీపీ) వ్యవస్థాపక దినోత్సవ పక్షోత్సవాల ముగింపు ఉత్సవం బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ విద్యార్థులను దేశభక్తి కలిగిన పౌరులుగా తీర్చిదిద్దేందుకు బీవీపీ దేశ స్థాయిలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. బీవీపీ సంస్థ అభివృద్ధికి దోహదపడుతున్న సభ్యులను అభినందించారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ దైవభక్తిని, దేశభక్తిని పెంపొందించుకుని రాణించాలన్నారు. బీవీపీ జాతీయ స్థాయి ప్రతినిధి రమేష్ చంద్‌జైన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నంలో 1987లో మొట్టమొదటి శాఖగా భారత్ వికాస్ పరిషత్‌ను స్థాపించామని తెలిపారు. స్వామి వివేకానందుని ఆశయాలతో బీవీపీ ముందుకెళ్తోందన్నారు. ఇప్పటి వరకు విశేష సేవలందించిన బీవీపీ ప్రతినిధులను అతిథుల చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో బీవీపీ ప్రాంత అధ్యక్షులు వంకాయల సన్యాసిరాజు, ప్రాంతీయ స్థాయి ప్రతినిధి ఎం.వి.వి.సత్యనారాయణ, మీడియా ఇన్‌చార్జి ఎం.వి.రాజశేఖర్, విశాఖ అధ్యక్షుడు సిహెచ్.వి.సత్యనారాయణ, కార్యదర్శి పి.భాస్కరరావు, కోశాధికారి జి.ఎస్.వి.మాణిక్యాలరావు, పి.షర్మిల, ఎం.ఎస్.ఎల్.శైలజ, వనజ పాల్గొన్నారు.

'గైస్'లో కోర్సుల నిర్వహణ పరిశీలన

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్) నిర్వహణను బుధవారం కాలేజీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు పరిశీలించారు. ఈ కాలేజీలో రెండు కోర్సులకు ఎన్‌బీఏ గుర్తింపు లభించినందున వాటి నిర్వహణ తీరుపై డైరెక్టర్ల బృందం సమీక్ష నిర్వహించింది. ప్రొఫెసర్ వీఎస్ఆర్‌కే ప్రసాద్, ప్రొఫెసర్ డీఏ నాయుడు, ప్రొఫెసర్ వి.పద్మశ్రీ, డాక్టర్ వోఎం రావ్, కేవీకే సుబ్బరాజు, అరుణలతో కూడిన బృందం కాలేజీలోని ప్రయోగశాలల నిర్వహణ, వాటిని విద్యార్థులు ఉపయోగించుకుంటున్న తీరు, ఇతర సౌకర్యాలను పరిశీలించింది. ఈ సందర్భంగా కెటలిస్ట్ న్యూస్ లెటర్‌ను బృంద సభ్యులు ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ, విభాగాల హెడ్‌లు పాల్గొన్నారు.

ప్రజా సేవ, సమాజ చైతన్యమే ప్రధాన లక్ష్యం

ఎంవీపీ కాలనీ: ప్రజాసేవ, సమాజ చైతన్యమే జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమాల ప్రధాన లక్ష్యం కావాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు అన్నారు. ఏయూ ఎన్ఎస్ఎస్ కేంద్రం సెమినార్ హాల్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఒక రోజు జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ల వార్షిక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు.

స్వచ్ఛభారత్, వ్యాక్సినేషన్, విపత్తుల సాయం, గ్రామీణ ప్రజల్లో చైతన్యం వంటి కార్యక్రమాలకు ఎన్ఎస్ఎస్ అధికారులు, వలంటీర్లు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కొత్త విధానాలతో ముందుకు సాగాలని సూచించారు. ఏయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ్ మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి జాతీయ సేవా పథకం నిర్వహించిన పలు జాతీయ స్థాయి కార్యక్రమాల్లో ఏయూ తరఫున వలంటీర్లు చురుగ్గా పాల్గొని, పతకాలు కూడా సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

డివిజన్ పరిధిలో డీఆర్ఎం భద్రతా తనిఖీలు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో కేకే లైన్ కొత్తవలస-శివలింగపురం మధ్య బుధవారం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ భద్రతా తనిఖీలు నిర్వహించారు. శివలింగపురం స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ మార్గంలో జరుగుతున్న ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ పనులు, ట్రాక్ సర్క్యూట్స్, టన్నెల్స్, పాయింట్స్, క్రాసింగ్స్, బ్రిడ్జిల నిర్వహణ, ట్రాక్షన్ సబ్ స్టేషన్స్, వసతులు, భద్రతా ప్రమాణాలు, రక్షణ గోడలు వంటి ప్రతి పనిని క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షా కాలంలో బండరాళ్లు ట్రాక్‌లపై పడేందుకు అవకాశమున్న ప్రాంతాలల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం స్టేషన్ మాస్టర్, సిబ్బందితో డీఆర్ఎం మాట్లాడారు. టన్నెల్స్, ఘాట్ సెక్షన్లలో ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్, సమాచార వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైళ్ల రాకపోకలు సాఫీగా సాగేందుకు అన్ని భద్రతా ప్రమాణాలను పాటించాలని, విధి నిర్వహణలో ఏ మాత్రం ఆదమరచి ఉండరాదని అధికారులకు, సిబ్బందికి సూచించారు. తనిఖీల్లో ఏడీఆర్ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 21.3 లక్షలు



నగదు లెక్కిస్తున్న సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు

కంచరపాలెం: జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవాదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకుల సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవారి హుండీలు లెక్కించారు. 50 రోజులకు గాను అమ్మవారి ముడుపులు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ. 21,03,182 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేషబాబా తెలిపారు. సహాయ కమిషనర్, దేవదాయ, శాఖ ఇన్‌స్పెక్టర్ బి. వసంతకుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఏపీజీవీ బ్యాంక్, కంచరపాలెం పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసలైతే భవిష్యత్ నాశనం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ డేవిడ్

అగనంపూడి : మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని దువ్వాడ ఎస్ఐ కె.డేవిడ్ అన్నారు. అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. పిల్లలకు మంచి భవిష్యత్ అందివ్వాలని తల్లిదండ్రులు ఆశ పడతారని, వారి ఆశలకు అనుగుణంగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు మనిషి జీవితాన్ని సర్వనాశనం చేస్తుందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్‌బాబు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, మోటూరి వెంకటరమణ, శివ దయాల్, కిడిమి హనుమంతురావు, ఎలుగుబంటి సత్యనారాయణ, విందుల నారాయణరావు, అధ్యాపకులు శ్రీదేవి, దివ్య, నాగేశ్వరరావు, ప్రదీప్, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

వామనావతారంలో జగన్నాథస్వామి



వామనావతారంలోని స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అగనంపూడి : జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలో జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా బుధవారం సుభద్ర, బలభద్రుని సమేత జగన్నాథస్వామి వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు గురు సంతోష్ ఉత్సవమూర్తులను అలంకరించారు. అగనంపూడి పరసర ప్రాంతాల భక్తులు దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, గొల్లవిల్లి కనక భవానీ, వెంకటరావు, పండా కుటుంబీకులు పాల్గొన్నారు.

నేడు హేరా పంచమి

రథోత్సవాల ఐదో రోజు కార్యక్రమంలో భాగంగా ఇంద్రద్యుమ్నహాలు వద్ద లక్ష్మీదేవి అమ్మవారు జగన్నాథస్వామి కోసం ఎదురుచూసే సన్నివేశం, స్వామి వారు రాలేదనే కోపంతో రగిలిపోతూ లక్ష్మీదేవి రథాన్ని విరగ్గొట్టి తిరిగి దేవాలయానికి వెళ్లిపోయే సన్నివేశాన్ని రక్తి కట్టించేలా హేరా పంచమి ఉత్సవాన్ని గురువారం సాయంత్రం నిర్వహించనున్నట్టు కరణం పైడిరాజు తెలిపారు. అలాగే సహస్ర దీపాలంకరణ ఘనంగా నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

సెయిల్‌లో విలీనం చేస్తున్నట్టు ప్రకటించాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకుడు రామస్వామి

అగనంపూడి : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించబోమని, సెయిల్‌లో విలీనం చేస్తున్నామని ఉక్కు మంత్రి కుమారస్వామి ప్రకటించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి డిమాండ్ చేశారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో దీక్షా శిబిరం 1245వ రోజు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వర్కింగ్ క్యాపిటల్ అందివ్వాలని, ఆర్థిక పరిపుష్టికి సహకారం అందివ్వాలని కోరారు. పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి సాగించేందుకు ముడిసరుకు అందివ్వాలని, వడ్డీలపై రెండేళ్లపాటు మారిటోరియమ్ ప్రకటించాలని, ఉద్యోగుల జీతాలు సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో డి.ఆదినారాయణ, ఎస్.రామారావు, శ్రీనివాసరావు, కామేశ్వరరావు, కోటేశ్వరరావు, వేణుగోపాలరావు, సుబ్బయ్య, శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు.

జోరుగా వెబ్ ఆప్షన్ల ఎంపిక



కంచరపాలెం పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రంలో ఆప్షన్ల ఎంపికకు వచ్చిన విద్యార్థులు

మురళీనగర్: ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహిస్తున్న వెబ్ ఆప్షన్ల ప్రక్రియ బుధవారం జోరుగా సాగింది. ఈ నెల 8న వెబ్ ఆధారిత కోర్సులు, కాలేజీల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ మొదటి రెండు రోజులు సర్వర్ సహకరించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం సాయంత్రానికి సర్వర్ పూర్తి స్థాయిలో పనిచేయగా.. బుధవారం ఆప్షన్ల ప్రక్రియ సజావుగా సాగింది. దీంతో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రానికి సుమారు వంద మంది విద్యార్థులు తరలివచ్చారు. సిస్టం అడ్మిన్ ఎస్.నాగరాజు పర్యవేక్షణలో ఆన్‌లైన్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆదాయ ధ్రువ పత్రాలు, ఈడబ్ల్యూస్ సర్టిఫికెట్ల అప్‌లోడ్‌తోపాటు మొబైల్ నంబర్ మార్పు, నాన్ లోకల్ అభ్యర్థులు స్థిర నివాస పత్రాలు అప్‌లోడ్ చేసుకున్నారు. లెక్చరర్ సిహెచ్.అప్పలనాయుడు విద్యార్థులకు సహకరించారు. 12వ తేదీ వరకు ఆప్షన్లు పెట్టుకోవచ్చు. ఈ నెల 13న ఆప్షన్లు మార్చుకోవచ్చు.

పీఎఫ్ చట్టంలో మార్పులు నిలిపేయాలి



జెండా ఎగురవేసి నినాదాలు చేస్తున్న నాయకులు

మధురవాడ : కార్మికుల హక్కుల పరిరక్షణకు మరిన్ని ఐక్య పోరాటాలు సాగించాలని సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మధురవాడ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములప్పడు, సీహెచ్ శేషుబాబు పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ 6, 7 వార్డుల కార్యాలయాల వద్ద బుధవారం నిరశన తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, శ్రామికుల హక్కులు హరించే విధంగా చట్టాలు రద్దు చేసి లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ చట్టంలో మార్పులు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మధురవాడ జోన్ ఉపాధ్యక్షుడు డి.అప్పలరాజు, నాయకులు బి.రాంబాబు, బి.గోవింద్, బి.నర్శయ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని వినతి

దాబాగార్డెన్స్: విశాఖలోని ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో మెరుగైన వైద్య సేవలు కల్పించాలని కోరుతూ బుధవారం ఇన్‌స్పెక్షన్‌కు వచ్చిన కామన్ సపోర్ట్ మిషన్ టీమ్ చైర్మన్ డాక్టర్ కామత్‌సింగ్, డాక్టర్ అజిత్‌కు సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసరావు, ఆర్‌టీ రాజు బృందం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ ఈఎస్ఐ బోర్డులో కార్మికుల డబ్బులు లక్షల కోట్లు ఉన్నా, సౌకర్యాలు కల్పించడంలో బోర్డు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఆపరేషన్ థియేటర్, ల్యాబ్‌లో రక్త పరీక్షలు గానీ, సామగ్రి గాని అందుబాటులో లేవన్నారు. తక్షణమే ఈఎస్ఐ పేషెంట్లకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే రిఫరల్ హాస్పటల్స్ సంఖ్య, బెడ్స్ సంఖ్య, అవసరమైన డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది సంఖ్య పెంచాలన్నారు. షీలానగర్ వద్ద గల ఈఎస్ఐ హాస్పటల్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, బర్న్స్ వార్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులకు మెరుగైన వైద్య సేవలు కల్పించకపోతే భవిష్యత్‌లో పెద్ద ఎత్తున కార్మికులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. దీనికి స్పందించిన కామన్ సపోర్ట్ మిషన్ టీమ్ చైర్మన్ డాక్టర్ కామత్‌సింగ్ విజయవాడలో ప్రిన్సిపల్ సెక్రటరీతో చర్చించి అవసరమైన చర్యలు చేపడతామని చెప్పినట్టు నరసింగరావు తెలిపారు.